చేపల విక్రయ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకొస్తాం

● రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

గోపాల్‌పేటలో చేపల విక్రయ కేంద్రాన్ని పరిశీలిస్తున్న చిన్నారెడ్డి

గోపాల్‌పేట, జూలై 13: నిరుపయోగంగా ఉన్న చేపల విక్రయ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో పశువైద్యశాల, శ్రీరామానందతీర్థ కుట్టు మిషన్ శిక్షణా కేంద్రం, నిరుపయోగంగా ఉన్న చేపల విక్రయ కేంద్రం, సంత కోసం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీరామానందతీర్థ కుట్టు మిషన్ శిక్షణా కేంద్ర భవనంలో మూత్రశాలలు లేక అసౌకర్యంగా ఉందని నిర్వాహకురాలు చిన్నారెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. మరో భవనం చూసి మార్చుదామన్నారు. పోలీస్ స్టేషన్ నుంచి బ్రిడ్జి వరకు ప్రధాన రోడ్డు వెంట స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయించాలని గ్రామస్తులు కోరగా.. అందుకు సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో తాసీల్దార్ తిలక్‌కుమార్‌రెడ్డి, మండల పశువైద్యాధికారి ఉదయ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్, నాయకులు ప్రవీణ్, సుధాకర్‌రావు, యాదయ్య, లక్ష్మణ్, భాస్కర్, పెంటన్న, విష్ణువర్ధన్‌రెడ్డి, శాంతన్న పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

పార్థివదేహంపై పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దేవరకద్ర ఎమ్మెల్యే జీఎమ్మార్

కొత్తకోట, జూల్ 13: పట్టణానికి చెందిన మాజీ ఉప్పసర్పంచ్ ధన్వాడ బాలస్వామి శుక్రవారం, స్థానికంగా నివాసముంటున్న నిరంజన్‌యాదవ్ శనివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి శనివారం మృత దేహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే బాధిత కుటుంబాల సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఎమ్మెల్యే వెంట మేస్త్రి శ్రీను, గొల్లబాబు, కృష్ణారెడ్డి, వేముల శ్రీనివాసు రెడ్డి, పీజే బాబు, నరేందర్‌రెడ్డి, భీమ్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వాల్మీకుల సన్మాన సభకు తరలిరావాలి

సభావేదికను పరిశీలిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు మద్దిలేటి

ఉండవెల్లి, జూలై 13: వాల్మీకి ప్రజాప్రతినిధుల సన్మాన సభకు వాల్మీకులు తరలిరావాలని ఐక్య వాల్మీకి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మద్దిలేటి పిలుపునిచ్చారు. మండలంలోని అలంపూర్ చౌరస్తాలోని ఓ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించే వాల్మీకి ప్రజాప్రతినిధుల సన్మాన సభావేదికను స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ.. అలంపూర్ నియోజకవర్గంలోని వాల్మీకి మాజీ ప్రజాప్రతినిధులను సన్మానించేందుకు ఏపీలో నూతనంగా ఎన్నికైన అనంతపురం ఎంపీ అంబికాలక్ష్మీనారాయణ, వాల్మీకి ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరామ్, కాల్వ శ్రీనివాసులు, పార్థసారధి, ఎమ్మెల్సీలు డాక్టర్ మధుసూదన్‌బాబు, బీటీ నాయుడు, ఏడీసీసీ జాయింట్ చైర్మన్ లిఖిత ముఖ్యఅతిథులుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. అలంపూర్ నియోజకవర్గంలోని వాల్మీకి నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐక్య వాల్మీకి పోరాట సంఘం మండలాధ్యక్షుడు రమణ, నాయకులు మధునాయుడు, పుల్లన్న, రామానాయుడు పాల్గొన్నారు.

25వ వార్డులో మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

మొక్కలను పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

వనపర్తి, జూలై 13: పట్టణంలోని 25వ వార్డులో జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి జయంతి వా రో త్స వా లను పురస్కరించుకొని బీజేపీ పట్టణ నాయకత్వం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి, తాజా మాజీ జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి వార్డుల్లో మొక్క లు నాటారు. మొక్కలు నాటడమే కాకుండా ప్రకృతిని కాపాడుకునే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బచ్చురాము, రాయన్నసాగర్, శ్రీశైలం, కుమారస్వామి, వెంకటేశ్వర్‌రెడ్డి, సుమిత్రమ్మ, శామ్యూల్, లక్ష్మీనారాయణ, శివ, కాలనీవాసులు చంద్రుడు, జమున, అలివేలమ్మ, విజయ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయ కమిటీ ఏర్పాటు

అమరచింత, జూలై 13: పట్టణంలోని పోచమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడిగా పోసిరిగారి విష్ణు, ప్రధాన కార్యదర్శి కుర్వ రఘు, ఉపాధ్యక్షులుగా జింక రవి, రాజు, కోశాధికారిగా రమేశ్‌తోపాటు మరో పదిమంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆలయ కమిటీ సలహాదారులు గోపి, విమలన్న తెలిపారు. ఈ సందర్భంగా వారు శనివారం ఆలయం ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 23న వైభవంగా నిర్వహించే పోచమ్మ బోనాలకు అన్ని కుల సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి నూతన కమిటీని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి

● జోగుళాంబ గద్వాల కలెక్టర్ సంతోష్

● ఆరు గ్యారెంటీల అమలుపై అధికారులతో సమీక్ష

అధికారులతో మాట్లాడుతున్న జోగుళాంబ గద్వాల కలెక్టర్ సంతోష్

గద్వాల, జూలై13: ప్రజా పాలనలో ఆరు గ్యారెంటీలు పొందేందుకు ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల్లో అర్హులం దరికీ సంక్షేమ పథకాలు అందేలా సంబంధిత అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సంతోష్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఆరు గ్యారెంటీల అమలుపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రజాపాలన దరఖాస్తులు ఎన్ని వచ్చాయి, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయని తెలుసుకున్నారు. మహాలక్ష్మి కింద రూ.500కే గ్యాస్ సిలిండర్ పొందేందుకు వచ్చిన దరఖాస్తుల్లో ఇప్పటి వరకు ఎంతమందికి ఇచ్చారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. గృహజ్యోతి పథకాన్ని ఇప్పటి వరకు ఎంతమందికి అమలు చేశారని దరఖాస్తు చేసుకున్న వారిలో ఇంకా జీరో బిల్లు రాని వాళ్లకు నిబంధనల ప్రకారం అమలయ్యేలా అధికారులు కృషి చేయాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం గురించి, ఇందుకోసం ఎన్ని బస్సులు వినియోగిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా సవరణలు చేసుకునేలా ఎంపీడీవోలు విస్తృత ప్రచారం గావించాలన్నారు. మహిళా శక్తిలో భాగంగా మహిళా శక్తి క్యాంటీన్, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఈవెంట్ మేనేజ్ మెంట్, స్వీచింగ్ సెంటర్లు, మైక్రో ఎంటర్‌ప్రైజెస్, కస్టమ్ హైరింగ్ సెంటర్స్, మహిళా శక్తి మీ సేవా సెంటర్లు మిగిలిన అంశాలపై ఎన్ని యూనిట్స్ ఉన్నాయి.. ఎంత ఖర్చవుతుంది, ఎన్ని యూనిట్లు గుర్తించారనే వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. మహిళా శక్తి కింద 2 మీ సేవా కేంద్రాల వివరాల నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. సోమవారం మహిళా శక్తి అంశాలపై అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలతో సమావేశం నిర్వహించాలన్నారు. గద్వాల, అయిజలో సాధ్యమైనంత వరకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు సిద్ధం చేయాలన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండలం, గ్రామాలవారీగా వివిధ శాఖలకు జిల్లాలో కేటాయించిన మేరకు లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. ఇప్పటి వరకు ఎన్ని మొక్కలు నాటారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాటిన మొక్కల రోజు వారీ వివరాలు టీజీఎఫ్ఎంఐఎస్‌లో నమోదు చేసి రోజువారీ నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, నర్సింగరావు అధికారులు కాంతమ్మ, విమల, వెంకట్‌రెడ్డి, రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారులు రైతులకు సహకరించాలి

రైతులు తమ పొలాల్లో నాణ్యమైన విత్తనాలు నాటుకొని అధిక దిగుబడి వచ్చే పంటలు సాగుచేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులు సహకరించాలని కలెక్టర్ సంతోష్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో వ్యవసాయశాఖ అధికారులతో ప్రస్తుత వ్యవసాయ సీజన్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఎన్ని ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారు, ఏ పంట ఎక్కువగా సాగు చేశారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి దాక కురిసిన వర్షాపాతం వివరాలు, ప్రస్తుతం పంటలు ఏ దశలో ఉన్నాయని అడిగారు. అందుకు వ్యవసాయ అధికారులు స్పందిస్తూ జిల్లాలో పత్తి, వరి, మిరప, కందులు ఎక్కువగా సాగు చేశారని, రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని చెప్పారు. ఎకరాకు ఎన్ని విత్తనాలు, ఎరువులు వినియోగిస్తున్నారని, నీటి లభ్యత వివరాలను మండలాల వారీగా అడిగారు. క్రాప్ బుకింగ్ ఎంతవరకు అయిందని, క్షేత్రస్థాయిలో పంటలు పరిశీలించి క్రాప్ బుకింగ్ వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గతేడాది జూలై, ఆగస్టులో ఎరువుల దుకాణాల నుంచి రైతులు ఎంతమేర విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేశారో సోమవారం వరకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో ఏడీఏలు వెంకటలక్ష్మి, సక్రియానాయక్, సంగీతలక్ష్మి, ఆయా మండలాల ఏవోలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీటీలకు న్యాయం చేస్తాం

● పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

వెంకటరంగయ్య దంపతులను సన్మానిస్తున్న నాయకులు

అలంపూర్, జూలై 13: సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు న్యాయం చేస్తామని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని లింగనవాయి ఉన్నత పాఠశాల జీహెచ్ఎం వెంకటరంగయ్య పదవీ విరమణ కార్యక్రమానికి శనివారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటరంగయ్య దంపతులను సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. వెంకటరంగయ్య ఉపాధ్యాయ వృత్తిలో చేసిన సేవల గురించి కొనియాడారు. పాఠశాలను అభివృద్ధి దిశగా ముందుకెళ్లడంలో కృషిచేశారన్నారు. 317 జీవోతో నష్టపోయిన ఉపాధ్యాయులను వెంటనే వారివారి సొంత జిల్లాలకు బదిలీ చేసేవిధంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ రద్దు చేయాలన్నారు. జీవో 11, 12ను సవరించి బీఎడ్ అర్హత కలిగిన సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ఉండే ఉద్యోగులకు ఎంప్లాయి హెల్త్ కార్డు వర్తింపజేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు తిమ్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి బీఎన్ వేణుగోపాల్, గౌరవాధ్యక్షుడు నర్సింహారెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, వెంకట్ నాయుడు, సతీశ్‌కుమార్, ఆయా మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే

గద్వాల అర్బన్, జూలై 13: ఆత్మరక్షణకు కరాటే చాలా ముఖ్యమని తైక్వాండో కరాటే అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీహరి పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బృందావన్ గార్డెన్‌లో తైక్వాండో బ్లాక్ బెల్ట్ ప్రదానోత్సవం నిర్వహించారు. తైక్వాండో చాంపియన్‌లో గెలుపొందిన వారికి బ్లాక్‌బెల్ట్, కప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యతోపాటు యువతకు కరాటే కూడా జీవితంలో ఒక భాగమని, దీనిని ప్రతి ఒక్కరూ నేర్చుకుంటే మనల్ని మనం కాపాడుకుంటూ ఆపదలో ఉన్నవారిని కూడా కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో సభ్యులు దేవిదాస్, ఆనంద్, షేక్షావళి, నారాయణగౌడ్, కృష్ణ ఉన్నారు.

వీల్‌చైర్ అందజేత

కొత్తకోట, జూల్ 13: పట్టణంలోని గ్రంథాలయం వీధికి చెందిన ఆరేండ్ల సాత్విక్‌కు పుట్టుకతో దివ్యాంగుడు. బాలుడి తండ్రి ఈ మధ్యకాలంలో మృతిచెందాడు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు నవీన్‌కుమార్‌రెడ్డి ద్వారా విషయం తెలుసుకున్న రంగారెడ్డి జిల్లాకు చెందిన మంజులాదయానంద్ శనివారం కొత్తకోటకు వచ్చి బాలుడి కుటుంబ పరిస్థితిని తెలుసుకుని వీల్‌చైర్ అందజేశారు. ఈ సందర్భంగా స్వాతిక్ కుటుంబ సభ్యులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు మహేశ్, చారి, అశోక్‌గౌడ్, ప్రభుచారి, రవి తేజ తదితరులు ఉన్నారు.

ఖాళీలను భర్తీ చేయాలి



మాట్లాడుతున్న ఎంఈఎఫ్ నాయకులు

వనపర్తి టౌన్, జూలై 13: రాష్ట్రవ్యాప్తంగా విద్యాశాఖలో ఖాళీగా ఉన్న డిప్యూటీ డీఈవో, డైట్ అధ్యాపకులు, ఎంఈవో పోస్టులను భర్తీ చేయాలని ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు గద్వాల కృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు లోకల్‌బాడీ ఉపాధ్యాయుల మొత్తంలో అందరికీ కలిపి పదోన్నతులు ఇవ్వాలని, 70, 30శాతం ద్వారా భర్తీ చేయాలని, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు కల్పించడం అభినందనీయమని, మిగిలిన పదోన్నతులను సీనియారిటీ ప్రకారం భర్తీ చేయాలని కోరారు. అదేవిధంగా జూనియర్ కళాశాల అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో ఎంఈఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటయ్య, నవీన్‌కుమార్, గౌరవాధ్యక్షుడు గిరిరాజాచారి, డీటీయూ నాయకులు వెంకటస్వామి, వెంకటేశ్, నర్సింహా, శ్రీనివాసులు, రాంబాబు తదితరులు ఉన్నారు.

నేడు సీపీఎం కార్యాలయం ప్రారంభం

పాన్‌గల్, జూలై 13: మండలకేంద్రంలో ఆదివారం సీపీఎం పార్టీ కార్యాలయాన్ని రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ, జిల్లా కార్యదర్శి జబ్బార్ ప్రారంభించనున్నట్లు మండల కార్యదర్శి బాల్యానాయక్ శనివారం ప్రకటనలో తెలిపారు. పార్టీ కార్యకర్తలు, శ్రేయోభిలాషులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ధరణి సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

● వనపర్తి అదనపు కలెక్టర్ నగేశ్

ధరణి సమస్యలపై సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ నగేశ్

ఆత్మకూరు, జూలై 13: మండలంలో ధరణి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ నగేశ్ అన్నారు. శనివారం తాసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన ధరణి సమస్యలపై సమీక్షించారు. ధరణితోపాటు వివిధ సమస్యలపై వచ్చే దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. ధరణి పోర్టల్‌లో వివిధ భూ సమస్యలపై అందించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్ర స్థాయిలో విచారించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ డివిజన్ పరిధిలోని సమస్యలతోపాటు కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని తెలిపారు. వారం రోజుల్లో పెండింగ్‌లో ఉన్నటువంటి 52 ధరణి భూ సమస్యలను పరిష్కరించాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వ భూమి ఎక్కడా ఆక్రమణకు గురికాకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తాసీల్దార్ రాజు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మదనాపురం తాసీల్దార్ కార్యాలయం తనిఖీ

మదనాపురం, జూలై 13: ధరణిలో పెండింగ్‌లో ఉన్న రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలని అదనపు కలెక్టర్ నగేశ్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన మదనాపురం తాసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధరణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించారు. తాసీల్దార్ అబ్రహం లింకన్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్ఐ వెంకటేశ్, రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

శాట్ చైర్మన్‌కు సన్మానం

ఎర్రవల్లి చౌరస్తా/మదనాపురం, జూలై 13: తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డిని ఎర్రవల్లి మాజీ సర్పంచ్ రవి ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో శాట్ చైర్మన్‌గా శివసేనారెడ్డి ప్రమాణస్వీకారం చేయగా.. కాంగ్రెస్ పార్టీ గద్వాల జిల్లా అధ్యక్షుడు దీపక్‌ప్రజ్ఞ, మాజీ సర్పంచ్ రవి ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గద్వాల నియోజకవర్గ అధ్యక్షుడు రాజేంద్ర, శ్రీనివాసులు, చంద్రుడు, రాజ్‌కుమార్, కృష్ణకాంత్, సిరాజ్, ఉమర్, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే మాదనపురం మాజీ ఎంపీపీ మహదేవన్‌గౌడ్, కురుమూర్తి దేవస్థానం పాలకమండలి సభ్యుడు గోపిస్వామి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అజ్జకొల్లు సాయిబాబా, నెల్విడి నాయకుడు విజయ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

శాట్ చైర్మన్‌ను సన్మానిస్తున్న ఎర్రపల్లి నాయకులు

శాట్ చైర్మన్‌ను సనానిస్తున్న మదనాపురం నాయకులు

సినీ దర్శకుడిని కలిసిన శాంతినగర్ వాసులు

వడ్డేపల్లి, జూలై 13: శాంతినగర్‌కు చెందిన శాంతినగర్ సేవాసమితి సభ్యులు, లఘు చిత్రాల క్రియేటర్స్ షేక్ అస్లాం షరీఫ్, దాసు వరం నాగరాజు సినిమా దర్శకుడు నాగశశిధర్‌రెడ్డిని శనివారం కలిశారు. ఈ సందర్భంగా లఘు, పెద్దచిత్రాల గురించి దర్శకుడితో ముచ్చటించారు. అలాగే శాంతినగర్ పరిసర ప్రాంతాల్లో ప్రతిభ ఉన్న వారిని ప్రోత్సహించాలని దర్శకుడిని కోరారు. తాను దర్శకత్వం వహించిన సీతారాం సినిమా త్వరలో విడుదల అవుతున్నదని ఆదరించాలని, టాలెంట్ ఉన్నవారిని తప్పకుండా ప్రోత్సహిస్తానని దర్శకుడు మాటిచ్చాడని తెలిపారు. ఈ సందర్భంగా దర్శకుడిని షేక్ అస్లాం షరీఫ్, దాసువరం నాగరాజు శాలువా కప్పి సన్మానించారు.

దర్శకుడిని సన్మానిస్తున్న శాంతినగర్ వాసులు

పెండింగ్ సమస్యల పరిష్కారం

కొత్తకోట, జూలై 13: పట్టణంలోని 15వ వార్డు ఎస్సీ కాలనీలో నెలకొన్న సమస్యలను కాలనీవాసులు డ్రైడే కార్యక్రమం ద్వారా కౌన్సిలర్ ఖాజామైనొద్దీన్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా శనివారం డ్రైనేజీని శుభ్రం చేయించి, దోమలు వ్యాప్తి చెందకుండా, ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను కాలనీవాసులకు వివరించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ అధికారులు వెంకటయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువకులకు అవగాహన

మానవపాడు, జూలై 13: 18ఏండ్లు నిండని యువకులు పనిలోకి వెళ్లకూడదని ఎస్సై చంద్రకాంత్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని జాతీయ రహదారి పక్కనున్న సాయిచక్ర కోల్డు స్టోరేజీలో పిల్లలు పనిచేస్తున్నారనే సమాచారంతో ఎస్సై ఆకస్మిక తనిఖీ చేశారు. స్టోరేజీలో బాలురు ఎవరూ పనిచేయడం లేదని సంస్థ యాజమాన్యం తెలిపారు. అనంతరం యువకులతో మాట్లాడుతూ.. 18ఏండ్లలోపు బాలలు పనులకు వెళ్లడం చట్టరీత్యా నేరమని, అలా ఎవరూ పనులకు వెళ్లకూడదని సూచించారు. పాఠశాల, కాలేజీకి వెళ్లి చదువుకోవాలన్నారు. పిల్లలను పనిలో చేర్చుకోవద్దని యాజమాన్యానికి సూచించారు.

ఉపాధ్యాయులకు ఆత్మీయ వీడ్కోలు

పాన్‌గల్, జూలై 13: మండలంలోని గోప్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు శనివారం గ్రామ ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ బాలకృష్ణ, నాయకులు పుల్లారావు, చంద్రూనాయక్, కృష్ణ, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, రాంచంద్రయ్య, రాఘవేంద్ర పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

రోగులకు నాణ్యమైన ఆహారం అందించాలి

వనపర్తి, జూలై 13: ప్రభుత్వ దవాఖానకు వచ్చే రోగులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రమేశ్, గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ జిల్లా నాయకులు జిల్లా దవాఖానలోని కిచెన్ షెడ్డులో ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోగులకు సాధారణమైన ఆహారమే అందిస్తున్నారని, వారికి బలవర్ధకమైన ఆహారాన్ని అందించడం లేదన్నారు. పరిశీలనలో రోగులకు అందించే ఆహారంలో పోషకవిలువలున్న ఆహారం అందడంలేదన్నారు. నిత్యావసర సరుకులపై సరైన వివరాలు లేవని, వాటివల్ల జరగరానిది జరిగితే ఎవరూ బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. రోగులకు ప్రతిరోజూ తాజా కూరగాయాలతో చేసిన వంటకాలను అందించాలని, ఆహారాన్ని అందించే వారు కూడా పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారులను కోరారు. సంబంధిత అధికారులు కిచెన్ షెడ్డులో వండుతున్న ఆహారాన్ని పరిశీలించాలన్నారు. రోగులకు సరైన ఆహారం అందించకపోతే బంధువులతో కలిసి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

కిచెన్ షెడ్డును పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

నేర సమాచారం

సైబర్‌క్రైమ్ కేసునమోదు

ఎర్రవల్లి చౌరస్తా, జూలై 13: సైబర్‌క్రైమ్ కేసు నమోదైన ఘటన శనివారం కోదండాపూర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్సై స్వాతి కథనం ప్రకారం.. మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన గొల్ల సాయిబాబా ఫోన్‌లో ఫేస్‌బుక్ వాడుతుండగా.. ఇండియన్ బుల్స్ ఫైనాన్స్ వారు రూ.లక్ష లోన్ ఇస్తామని చెప్పడంతో, గొల్ల సాయిబాబా తన ఫోన్‌లో వారు చెప్పిన యాప్‌ను ఇన్‌స్టాల్ చేశాడు. అనంతరం సాయిబాబా యాప్‌లో తన పూర్తివివరాలు నమోదు చేసిన 10నిమిషాల్లోనే తన అకౌంట్ నుంచి రూ.27,900 కట్ కావడంతో మోసపోయానని భావించి శనివారం కోదండాపూర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సాఫ్ట్‌వేర్ యువకుడి ఆత్మహత్య



కేశవరావు(ఫైల్)

అయిజ, జూలై 13: పట్టణంలోని ఉప్పలదొడ్డి పేటలోని నీటి సంపు సమీపంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటు చేసుకున్నది. ఎస్సై విజయ్ భాస్కర్ కథనం మేరకు.. మండలంలోని ఉప్పల క్యాంపునకు చెందిన మల్లికార్జునరావు, శారద దంపతుల కుమారుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కేశవరావు (24) బీటెక్ పూర్తి చేసి కొంతకాలంగా చెన్నైలో ఉద్యోగం చేశాడు. మానసిక వేదనకు గురి కావడంతో చికిత్స నిమిత్తం ఉప్పల క్యాంపునకు చేరుకున్నాడు. నిత్యం మందులు వేసుకోవాలని తల్లిదండ్రులు చెబుతున్నప్పటికీ వేసుకోకుండా నిర్లక్ష్యం చేసేవాడు. శుక్రవారం అయిజలోని బంధువుల ఇంటికి వచ్చాడు. శనివారం తెల్లవారుజామున ఉప్పల దొడ్డిపేట సమీపంలోని సంపు వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రహించిన వాటర్‌మెన్ పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు యువకుడి భౌతికకాయాన్ని పోర్టుమార్టం నిమిత్తం గద్వాల దవాఖానకు తరలించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గొర్రె పొట్టేళ్లు చోరీ

గోపాల్‌పేట, జూలై 13: గొర్రె పొట్టేళ్లు చోరీకి గురైన ఘటన మండలంలోని బుద్దారంలో చోటుచేసుకున్నది. ఎస్సై హరిప్రసాద్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చిక్కొండ్ర చంద్రయ్యకు 30 గొర్రె పొట్టేళ్లు ఉన్నాయి. రోజులాగే ఈనెల 10వ తేదీన అతడి పొలంలో ఉన్న షెడ్ వద్ద ఆపాడు. రాత్రి 11గంటల ప్రాంతంలో వ